ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం, 2 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 2PM



# సీఎం రేవంత్ ఇంటికి 'బండ్ల'

హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రజాస్వరం) : గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పార్టీ మార్పు అంశం రోజుకో మలుపు తీరుగుతున్నది. బీఆర్ ఎస్ నుంచి గెలిచిన ఆయన ఇటీవల కాంగ్రెస్లో చేరిన విషయం తెలిసిందే. అక్కడ పట్టించుకోవడం లేదని రెండు రోజుల క్రితం తిరిగి బీఆర్ ఎస్ లోనే కొనసాగుతానని ప్రకటించారు. ఈమేరకు కేటీఆర్ ను కలిశారు. దీంతో, అప్రమత్తమైన కాంగ్రెస్ ఆయనను బుజ్జగించే బాధ్యతను మంత్రి జూపల్లి క్రిష్ణారావుకు అప్పగించింది. నిన్న జూపల్లి ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి బుజ్జగించారు. అనంతరం మీడియాతో మాటాల్డుతూ బండ్ల కాంగ్రెస్లోనే కొనసాగుతారని ప్రకటించారు. ఈరోజు ఉదయం క్రిష్ణమోహన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని మరోసారి కలిశారు. దీంతో బండ్ల ఏ పార్టీలో ఉన్నారో తెలియడం లేదని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.



నీట్ పేపర్ లీక్..

## ఆ రెండు ప్రాంతాల వరకే

### వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ప్రజాస్వరం) : నీట్ యూజీ 2024 పరీక్ష ప్రశ్నపత్నం లీకేజీ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరీక్షను రద్దు చేయాల్సిన అవసరం లేదంటూ ఇటీవల కీలక తీర్పునిచ్చిన ధర్మాసనం.. అందుకుగల కారణాలను వివరిస్తూ శుక్రవారం మళ్లీ తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లోపాలను ధర్మాసనం ఎత్తిచూపింది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది. 'విస్తృత స్థాయిలో లీక్ జరగలేదు. ఝార్ఖండ్ లోని హజారీబాగ్, బిహార్ లోని పట్నా వరకే పరిమితమైంది. దానిపై దర్యాప్తు జరుగుతోంది. అందుకే మేం పరీక్షను రద్దు చేయాలనుకోలేదు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్టీయేదే' అని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈసందర్భంగా ఎన్టీయే పనితీరు, పరీక్షల్లో సంస్కరణల కోసం నియమించిన ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని కమిటీకి సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్యానెల్ ను మరింత విస్తరించాలని పేర్కొంది. పరీక్షా విధానంలో లోపాలను సరిదిద్దడానికి అవసరమైన చర్యలపై కమిటీ సెప్టెంబరు 30లోగా తమ నివేదికను అందజేయాలని ఆదేశించింది. పరీక్షా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అంతర్జాతీయ సాంకేతిక సంస్థల సాయం తీసుకోవాలని సూచించింది. ఈ నివేదిక అందిన తర్వాత అందులోని అంశాలను అమలుచేసే అంశంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రం, విద్యాశాఖను ధర్మాసనం ఆదేశించింది.

## కాంగ్రెస్ బిల్లులను సమర్థించిన బీజేపీ

హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రజాస్వరం) : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల చివరి రోజైన శుక్రవారం కాంగ్రెస్ సర్కారు పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. సివిల్ కోర్టు సవరణ బిల్లును సమర్థిస్తూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ప్రభుత్వానికి కొన్ని సూచనలను చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెంచాలని కోరారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కోర్టులకు సొంత భవనాలు లేవని.. అద్దె భవనాల్లో కోర్టులు నిర్వహించడం బాధాకరం అన్నారు. నియోజకవర్గాల్లో జూనియర్ సివిల్ కోర్టులు లేవన్నారు. కేసులు సత్వర పరిష్కారం కావాలంటే జూనియర్ సివిల్ కోర్టులు పెంచాలన్నారు. కోర్టుల అంశంలో గత ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దాలన్నారు. తెలంగాణ సంక్షిప్త పదాలను టీఎస్ నుంచి టీజీగా మార్చే బిల్లునూ బీజేపీ సమర్థించింది.

# హైదరాబాద్‌లో మరో క్రికెట్ స్టేడియం

లక్ష మంది కూర్చునే సామర్థ్యం, అధునాతన సదుపాయాలు

బేగరికంచలోని స్కిల్ యూనివర్సిటీకి సమీపంలో నిర్మాణం

బీసీసీఐతో చర్చించాం : సీఎం రేవంత్ రెడ్డి

మహమ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్ కు ప్రభుత్వ ఉద్యోగాలు

హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రజాస్వరం) : నగరంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. బేగరికంచలోని స్కిల్ యూనివర్సిటీకి సమీపంలో ఈ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనిపై బీసీసీఐతో ప్రాథమిక చర్చలు పూర్తిచేశామని శాసనసభలో ప్రకటించారు. రాష్ట్రంలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. త్వరలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామన్నారు. దీనికోసం హరియాణా విధానాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడల కోసం బడ్జెట్ లో రూ.321కోట్లు కేటాయించామన్నారు. యూసుఫ్గూడ, గచ్చిబౌలి, సరూర్ నగర్ స్టేడియాల్లో క్రీడలు తగ్గాయని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో క్రీడలు తగ్గి.. రాజకీయ కార్యకలాపాలు పెరిగాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ కు గ్రూప్ -1 ఉద్యోగం ఇస్తున్నామన్నారు. బాక్సర్ నిఖత్ జరీన్ కు ఆర్థికసాయం చేశామని.. ఇంటిస్థలం కూడా కేటాయించామని తెలిపారు. వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకురావాలంటే క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే సమావేశాల్లో క్రీడలకు సంబంధించిన పాలసీ తీసుకొస్తామని.. దీనికి సంబంధించి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దీనికి అందరూ సహకరించాలని సీఎం కోరారు.





# కేరళకు రెడ్అలర్ట్

### మరోసారి వర్షాలు ముంచెత్తొచ్చని హెచ్చరిక

300 దాటిన మృతుల సంఖ్య .. 200 మందికి గాయాలు

నాలుగో రోజు కొనసాగుతున్న సహాయక చర్యలు

వెయ్యి మందిని కాపాడిన రెస్క్యూ సిబ్బంది



వయనాడ్, ఆగస్టు 2 (ప్రజాస్వరం) : వయనాడ్లో నాలుగో రోజు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇప్పటి వరకు వెయ్యి మందిని కాపాడారు. కాగా.. మరో 200 మందికి గాయలవ్వగా వారందరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విలయంలో ఇప్పటివరకు 308 మంది చనిపోయారు. ఆర్మీ, ఎన్డిఆర్ఎఫ్, కోస్ట్ గార్డ్, నేవీతో కూడిన సంయుక్త బృందం సహాయకచర్యలు కొనసాగిస్తోంది. నలభై బృందాలుగా ఏర్పడి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. చలియార్ నది పరిధిలోని 8 పోలీస్ స్టేషన్లలోని సిబ్బంది, గజఈతగాళ్లు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. హెలికాప్టర్ ద్వారా రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నారు. ఇప్పటికే సహాయక చర్యల్లో ఆరు శునకాలు నిమగ్నమై ఉండగా.. మరో నాలుగింటిని తమిళనాడు నుంచి వయనాడ్ కు తీసుకురానున్నారు. కాగా, రాబోయే రెండు రోజుల్లో వయనాడ్ సహా ఇతర జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇడుక్కి, త్రిసూర్, పాలక్కాడ్, మలప్పురం, కోజికోడ్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించింది. దీంతో మరోసారి ఆందోళన మొదలైంది.

## సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం

### కేటీఆర్ వర్సెస్ మంత్రి పొన్నం



హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రజాస్వరం) : సోషల్ మీడియాలో జరుగుతున్న ఫేక్ ప్రచారంపై కేటీఆర్ వర్సెస్ మంత్రి పొన్నంల మధ్య మాటల యుద్ధం నడిచింది. తొలుత కేటీఆర్ మాట్లాడుతూ.. సభలో తమ సభ్యులు వీడియోలు తీయలేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననం జరుగుతోందన్నారు. ప్రధాని, సీఎంల వ్యక్తిత్వాన్ని కూడా కించపరిచేలా వీడియోలు పెడుతున్నారని మండిపడ్డారు. దీనికి మంత్రి పొన్నం రిప్లై ఇస్తూ.. రాష్ట్రంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు వచ్చిన ఇబ్బందేమీ లేదని మంత్రి పొన్నం అన్నారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు అతిగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. మహిళా మంత్రిపైనా వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సభా కార్యక్రమాలపై ఫేక్ వీడియోలు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## లైంగిక వేధింపులతో బాలిక ఆత్మహత్య

హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రజాస్వరం) : రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లో దారుణం జరిగింది. లైంగిక వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ప్రేమ పేరుతో బాలికను శివ అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా లైంగికంగా వేధించినట్లు తెలిసింది. వేధింపులు భరించలేక శాలిని ఉరి వేసుకుంది. పోలీసుస్టేషన్ లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

## రేవంత్.. జాగ్రత్త

హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రజాస్వరం) : బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు అవుతుందో లేదో కానీ మీరు అమెరికా వెళ్లి వచ్చే వరకు మీ సభ్యత్వం రద్దయ్యేలా ఉందని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. ముఖ్యమంత్రి బెదిరిస్తే భయపడే వాళ్ళు లేరని అన్నారు. సబితా ఇంద్రారెడ్డిని అవమానించిన సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మైక్ ఇవ్వడం లేదని ఆరోపించారు.



## సెక్రటేరియట్ వద్ద ఉద్రిక్తత

సచివాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. సెక్రటేరియట్ ముట్టడికి యత్నించిన మాజీ సర్పంచులను పోలీసులు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో సచివాలయం వైపు ర్యాలీగా వెళుతున్న పలువురు సర్పంచులను పోలీసులు అడ్డగించి అరెస్ట్ చేశారు.